

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 136 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 16, ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# ఎన్నికల నిర్వహణపై.. సుప్రీం సీరియస్

పోలింగ్ కేంద్రాలను కట్టుదిట్టం చేయాలి

జాతీయ ఎన్నికల విధానంలో పలు విధాల మార్పులు సంభవించాలి

జాతీయ ఎన్నికల కమిషన్కు సుప్రీం కోర్టు నోటీసులు

ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరగడానికి కసరత్తులు

పదుల సంఖ్యలో ఎన్నికల నిర్వహణపై సుప్రీంకోర్టులో కేసులు పడ్డాయి

ఎలక్షన్ కమిషన్ తప్పులవల్లే దేశంలో ఎన్నికల సరళి దారి తప్పుతుంది

ఎన్నికల విధానంపై స్పష్టత రావాలంటే బయోమెట్రిక్ తప్పనిసరి

ఓటుతోపాటు వేలిముద్ర ఉంటేనే తప్పులకు ఆస్కారం ఉండదు

ఓటర్ల జాబితా మార్పుపై తీవ్ర అభ్యంతరాలు వస్తున్నాయి

అధికార పార్టీ వైపు గెలుపు కోసం ఎన్నికల నిర్వహిస్తున్నట్లుగా ఉంది

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

ఎన్నికల నిర్వహించబడుతున్న రాష్ట్రాల్లో అన్ని శాఖల్లో అధికార పార్టీదే హవా నడుస్తుందని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా విమర్శించారు.ప్రతి ప్రభుత్వ శాఖలో కేంద్ర ప్రభుత్వానికి అనుకూలమైన అధికారులు పదవుల్లో కొనసాగుతున్నందున ఎన్నికల సజావుగా సాగే ఆస్కారం లేదని సూచించారు.ఇప్పటికే సుప్రీంకోర్టులో పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ తప్పకుండా చేయాలంటూ కేంద్రానికి ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు పంపించడం సంచలనంగా మారిందన్నారు.ఎన్నికల నిర్వహణ సమయంలో పారదర్శకత కోసం కేంద్రాల్లో ఓటర్ల బయోమెట్రిక్ ధ్రువీకరణ తప్పనిసరి చేయాలని కోరుతూ సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్ తో పాటు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశించడం జరిగిందన్నారు. దొంగ .ఓట్లను అరికట్టేందుకు సాంకేతికతను వాడడం మంచిదేనని అయితే దీని అమలుపై ప్రభుత్వ అభిప్రాయం ఈసీ అభిప్రాయం అధికారుల అభిప్రాయం పట్ల సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించడం ఎన్నికల

- మిగతా 2లో..

డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది: జీవన్ రెడ్డి

ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శ

కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని ఆగ్రహం

రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ కాదన్న జీవన్ రెడ్డి

కేసీఆర్‌కు ప్రజలు అంటే గౌరవం ఉందని వ్యాఖ్య



2

## భారత్‌లో తొలిసారి.. హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్

ఫ్యూచర్ సిటీలో శాశ్వత ప్రాంగణం.. తాత్కాలికంగా లేక్ వ్యూ గెస్ట్ హౌస్

2027-28 విద్యా సంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభమయ్యే అవకాశం

హైదరాబాద్‌ను గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వ అడుగులు



2

## మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ సంపూర్ణ మద్దతు

డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి

దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని వెల్లడి



6

## తెలంగాణలో భగ్గుమన్న సూరీడు

పలు జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన ఎండలు

తెలంగాణలో ఉగ్రరూపం దాల్చిన ఎండలు.. రానున్న 5 రోజులు కీలకం


నల్గొండ జిల్లాలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పలు జిల్లాల్లో 42 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు

రానున్న ఐదు రోజుల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం

వాతావరణ శాఖ నుంచి ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



తెలంగాణలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మధ్యలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

మంగళవారం నాటి వాతావరణ శాఖ నివేదికల ప్రకారం నల్గొండ జిల్లా అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4 డిగ్రీలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 43.2 డిగ్రీలు నమోదు కాగా, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో కూడా పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోత కూడా అధికంగా ఉండటంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును కూడా దాటవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# ఎన్నికల నిర్వహణపై సుప్రీం సీరియస్

మొదటి పేజీ తరువాయి




నియమాల్ని సరియైన మార్గంలో నడిపించడం కోసమే నంటూ రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారని తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్ లిస్ట్ బయోమెట్రిక్ విధానాన్ని అమలు పరచడం కష్టతరం కావచ్చునేమో గాని భవిష్యత్ తరంలో ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసేందుకు అన్ని ప్రభుత్వ వ్యవస్థలు కలిసి పని చేయాలని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సూచించడం దేశ ప్రజలకు ఎన్నికల విధానం పట్ల నమ్మకం కలిగించడం కోసమే సుప్రీంకోర్టు ప్రయాసపడినట్లుగా తెలుస్తుందన్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ఓటర్ ఐడెంటిటీ కార్డుతో పాటు వేలిముద్ర ద్వారం మాత్రమే ఓటు వేసే ఆస్కారం ఉంటుంది కాబట్టి దొంగ ఓట్లు వేయడానికి ఏమాత్రం అవకాశం ఉండకపోవచ్చునని సుప్రీంకోర్టు భావిస్తున్నట్లు తెలిపారు. మొన్న బీహార్ లో జరిగిన ఎన్నికల్లో సుమారుగా రెండు కోట్ల 42 లక్షల ఓట్లను అదనంగా లెక్కించిన జాతీయ ఎన్నికల కమిషన్ దేశ ఎన్నికల విధానాన్ని బజారునకు ఈడ్చినట్లుగా కనిపించిందని అందువల్లనే ఎన్నికల విధానాన్ని కఠిన తరం చేయడం కోసం ఈ విదంగా ప్రయత్నిస్తుందని సుప్రీంకోర్టులో నమోదు చేయబడుతున్న ప్రతి కేసును ఛాలెంజ్గా తీసుకుంటూ ఎన్నికల విధానాన్ని పటిష్టం చేయడానికి తీవ్రమైన కృషి చేస్తున్నట్లుగా తెలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నచ్చినా నచ్చకపోయినా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు బయోమెట్రిక్ విధానం తప్పనిసరి అనేసరికి కేంద్ర ప్రభుత్వం పరిధిలో అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక్కసారిగా జలకు పుట్టిందన్నారు. ప్రజల మనోభావాలకు మాత్రమే అనుకూలంగా ఎన్నికల జరిగించబడినట్లుగా సుప్రీంకోర్టు కసారత్తు చేస్తుండడం దేశ ప్రజల కోసంమేనని భావించాలన్నారు. 2014 నుండి జరుగుతున్న ప్రతి ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వివిధ విధానాల వల్ల ప్రపంచ దేశాలన్నీ భారతదేశ ఎన్నికల విధానాన్ని తప్పుపడుతూ ఉండడమే కాకుండా క్షేత్రస్థాయిలో తప్పులు దొర్లుతున్నాయని తెలుపుతుండడం వల్ల పలువురు రాజకీయ పరిశీలకులు సుప్రీంకోర్టును ఆశ్రయించి కేసులు వేసినట్లు విశ్వాసనీయ సమాచారమని తెలిపారు. గతంలో బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించబడినప్పుడు కాస్తాన్ని పొరపాట్లు తప్ప ఎక్కడ పెద్దగా అప్పుడు జరిగినట్లుగా చూడలేదని ప్రస్తుతం దేశ ప్రజలందరూ భారతదేశ ఎన్నికలను ఇతర దేశాలలో బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించాలని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నప్పటికీ బ్యాలెట్ ఎన్నికల వల్ల కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాదని తెలుసిపోవడంతో ఇప్పుడు నిర్వహించబడుతున్న ఎన్నికల విధానాన్ని తిరిగి కొనసాగిస్తూ అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుంటుందని స్పష్టంగా తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఎన్నికల విధానాల మార్పులపై అధికార యంత్రంగాలు ముందుకు రావాలని ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా నిర్వహించబడుతున్న ఎన్నికలపై సాంకేతికపరమైన పోరాటాలు జరగాలని సూచించారు. ప్రజాభిష్టానమేరకు మాత్రమే ఎన్నికల నిర్వహించబడతాయని ఆశించినట్లయితే భారతదేశ వ్యాప్తంగా అన్ని పార్టీలు వాళ్ల వాళ్ల బలాబలాలను పరీక్షించుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ఇకనైనా దేశ ఎన్నికల విధానంలో సమూలమైన మార్పులు సంభవించకపోతే భారతదేశం ప్రపంచ దేశాల చేత అత్యంత అవహేళనగా అవమానించబడుతుందని గుర్తు చేస్తూ జాతీయ ఎన్నికల విధానంపై సుప్రీంకోర్టు పెడుతున్న ఆంక్షలు సరియైనవేనని అవన్నీ ఆమోదయోగ్యంగా అమలు పరచబడి దేశ ప్రజలకు ఈ రకంగా నైనా మేలు జరిగించబడాలని కోరారు.

## ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోలు నిలిపివేత దురదృష్టకరం

### రైతులకు వెంటనే న్యాయం చేయాలి: ఆరేగంటి నాగరాజు గౌడ్

**హన్మకొండ, 15 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ చైర్మన్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరేగంటి నాగరాజు గౌడ్ రాష్ట్రంలో రైతుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఐకేపీ సెంటర్లలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిలిపివేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. కేయూ ప్రెస్ మీట్‌లో నాగరాజు మాటా ్లడుతూ, ఈ దేశానికి అన్నం పెడుతున్న రైతన్న నేడు కంటతడి పెట్టే పరిస్థితి తెలంగాణలో కనిపిస్తోందన్నారు. ఆరు నెలల పాటు ఎండనక వాననక కష్టపడి పండించిన పంటను ఐకేపీ సెంటర్లకు తీసుకొచ్చిన తర్వాత, వడ్లు తడిగా ఉన్నాయని లేదా నాణ్యత లేదని కారణాలు చూపుతూ కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను అనేక ఇబ్బం దులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం పూర్తిగా ఎండితేనే కొనుగోలు చేస్తామని చెప్పడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇది రైతుల జీవితాలతో చెలగాటమాడటమేనని తీవ్రంగా విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని, బాధ్యులైన రైస్ మిల్లర్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఐకేపీ సెంటర్లలో నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా మరియు మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అలాగే జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్క రించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు తక్షణ న్యాయం జరిగేలా ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. లేకపోతే, ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం తరహాలోనే తెలంగాణలో కూడా పెద్ద ఎత్తున రైతు ఉద్యమానికి శ్రీకారం చుడతా మని హెచ్చరించారు. రైతుతో చెలగాటమాడితే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. "ఎద్దేడిచిన వ్యవసాయం, రైతు ఏడ్చిన ప్రభుత్వం నిలవదు" అని పేర్కొంటూ, రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆరేగంటి నాగరాజు గౌడ్ కోరారు.

## హాసన్‌పర్తిలో మండల స్థాయి సమావేశం - ఎంపీడీఓ సుమన వాణి




**హాసన్‌పర్తి, 15 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి హాసన్‌పర్తి మండలంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమన వాణి తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను గ్రామ స్థాయిలో సక్రమంగా అమలు చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతు సంఘాల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఇతర విభాగాల ప్రతినిధులు విస్తృతంగా హాజరుకానున్నారు. మండల పరిధిలో అమలవుతున్న పథకాల ప్రగతి, సమస్యలు, అడ్డంకులు మరియు వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ప్రత్యేకంగా రైతు సంక్షేమం, తాగునీటి సదుపాయం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, విద్య మరియు ఆరోగ్య రంగాలపై దృష్టి సారించాలని అధికారులు భావిస్తున్నారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను కచ్చితంగా అమలు చేసే దిశగా కార్యాచరణ రూపొందించనున్నారు. సమావేశంలో తీసుకునే నిర్ణయాలను క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేయాలని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ సుమన వాణి సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని, అభివృద్ధి పనులు వేగవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సమావేశం ద్వారా మండల అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది: జీవన్ రెడ్డి

### ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శ
### కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం ం చేస్తున్నాడని ఆగ్రహం
### రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ కాదన్న జీవన్ రెడ్డి
### కేసీఆర్‌కు ప్రజలు అంటే గౌరవం ఉందని వ్యాఖ్య

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిందని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని అన్నారు. కేసీఆర్ తన వయసును గౌరవించి 'అన్న' అని పిలుస్తారని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజలంటే గౌరవం ఉందని, ఆయన రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కాదని వ్యాఖ్యానించారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై స్పందిస్తూ, ఆఖరి వరకు ప్రజల కోసమే పోరాడతానని స్పష్టం చేశారు. సాధారణంగా పార్టీ సూచనలను బట్టి ప్రభుత్వం నడుస్తుందని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో ప్రభుత్వం సూచన మేరకు పార్టీ నడుస్తుందని విమర్శించారు.

## భద్రకాళి క్షేత్రంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ అధికారులు




**వరంగల్, 15 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

చారిత్రక ప్రాధాన్యత కలిగిన హనుమకొండ నగరంలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో స్వస్తి శ్రీ పరాభవనామ సంవత్సరానికి సంబంధించిన శ్రీ భద్రకాళి–భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుండి 30వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తుల విశేష ఆదరణ పొందే ఈ ఉత్సవాలు ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, హోమాలు, వాహన సేవలు, కళ్యాణోత్సవం వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే భక్తుల ఆధ్యాత్మిక భావాలను మరింతగా పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాల విజయవంతమైన నిర్వహణ కోసం ఆలయ పరిసరాల్లో శుభ్రత, భక్తులకు తాగునీరు, క్యూలైన్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు వంటి అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆలయ అధికారులు వెల్లడించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శేషు, కార్యనిర్వాహక అధికారి (ఈఓ) సునీత హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యత, నిర్వహణ వివరాలను ఆయనకు వివరించి, ఉత్సవాలకు విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆహ్వానించారు. అనంతరం అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, భద్రకాళి అమ్మవారి క్షేత్రం తెలంగాణలో విశేషమైన ఆధ్యాత్మిక కేంద్రమని, ప్రతి సంవత్సరం జరిగే బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల విజయవంతం కోసం తనవంతు సహకారం అందిస్తానని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ బ్రహ్మోత్సవాలు ప్రాంతీయంగా మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## గ్యాస్ కావాలంటే.. 2 కి.మీ. నడవాల్సిందే!

### ఏజెన్సీ నిర్వాకం - పేద మహిళకు కష్టాల పర్వం




**హనుమకొండ జిల్లా/ఆత్మకూరు, 15 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

ఆత్మకూరు మండలంలో గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ బుకింగ్ చేసిన వినియోగదారుల ఇంటి వద్దకే సిలిండర్‌ను సరఫరా చేయాల్సి ఉండగా, ఆచరణలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. ఏజెన్సీ నిర్లక్ష్యంతో ఓ పేద మహిళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. దామెర మండలం ఓగ్లాపూర్ గ్రామానికి చెందిన దాడి కొమురమ్మ జీవితమే పోరాటంగా మారింది. భర్త మృతి చెందగా, ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిపి ప్రస్తుతం ఒంటరిగా కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. రోజువారీ కూలీ సంపాదనతోనే జీవనం సాగించే ఆమెకు ప్రతి రూపాయి విలువైనదే. ఇటీవల ఆమె వంట గ్యాస్ సిలిండర్ ఖాళీ కావడంతో వెంటనే మొబైల్ ద్వారా బుకింగ్ చేసింది. సాధారణంగా కొన్ని రోజుల్లోనే సిలిండర్ ఇంటికే చేరాల్సి ఉండగా, 15 రోజులు గడిచినా ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఆమె ఆందోళన చెందింది. వంట చేయలేని పరిస్థితి ఏర్పడి, పొయ్యి పెట్టుకుని వంట చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సమస్యపై రెండు రోజుల క్రితం ఆత్మకూరులోని సంబంధిత గ్యాస్ ఏజెన్సీని ఆమె స్వయంగా సంప్రదించగా, స్టాక్ లేదు అంటూ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దీంతో నిరాశ చెందిన ఆమె మంగళవారం మళ్లీ ఏజెన్సీని ఆశ్రయించగా, గ్యాస్ గోదాం వద్దకు వచ్చి సిలిండర్ తీసుకెళ్లాలి అని చెప్పడంతో పరిస్థితి మరింత విషమమైంది. ఆటోలో వెళ్లి తెచ్చుకోవాలంటే అధిక ఛార్జీలు చెల్లించాల్సి ఉండటంతో, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కొమురమ్మకు అది సాధ్యపడలేదు. చివరకు దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్యాస్ గోదాముకు ఖాళీ సిలిండర్‌ను స్వయంగా జాతీయ రహదారిపై తోసుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. మండుతున్న ఎండలో, బరువైన సిలిండర్‌ను తోసుకుంటూ వెళ్లిన ఆమె దృశ్యం స్థానికులను కదిలించింది. సిలిండర్‌ను ఇంటికే అందించాల్సిన బాధ్యత గ్యాస్ ఏజెన్సీలపై ఉండగా, ఈ విధంగా వినియోగదారులను ఇబ్బందులకు గురి చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పేదల పరిస్థితిని అర్థం చేసుకోకుండా వ్యవహరిస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో గ్యాస్ సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలు బయటపడుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, గ్యాస్ ఏజెన్సీల పనితీరును సమీక్షించి, వినియోగదారులకు సకాలంలో, ఇంటి వద్దే సిలిండర్ అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భారత్‌లో తొలిసారి.. హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' తమ తొలి భారతీయ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఐటీ, బయోటెక్ రంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి పొందిన నగర కీర్తి కిరీటంలో ఈ పరిణామం మరో కలికితురాయిగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలోని ఎడ్యుకేషన్ జోన్‌లో ఈ విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. దీని నిర్మాణం పూర్తయ్యే వరకు, నగరం నడిబొడ్డున ఉన్న లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌ను తాత్కాలిక ప్రాంగణంగా వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. 2027–28 విద్యా సంవత్సరం నాటికి కోర్సులను ప్రారంభించే లక్ష్యంతో వర్సిటీ ప్రతినిధులు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు (యూజీసీ) దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేశారు.

# ఉర్సుగుట్ట జంక్షన్‌లో 'అరైవ్ అలైవ్' ఘన విజయం





### 600 మంది విద్యార్థులతో మహా మానవహారం, హెల్మెట్ పంపిణీతో భద్రతా సందేశం

**వరంగల్, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద అత్యంత విజయవంతంగా జరిగింది. ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ విజయ, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం ప్రకాష్, ఆర్టీవో శోభన్ బాబు తదితర ఉన్నతాధికారులు హాజరై కార్యక్రమానికి ప్రాధాన్యతను చాటారు. అలాగే ఏసీపీ ట్రాఫిక్ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు కోడూరి సుజాత, వెంకన్న, రమేష్, ఎమ్మార్వో ఇక్బాల్ తదితరులు సమన్వయం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహాత్మా జ్యోతిరావ్ ఫూలే పాఠశాల నుండి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొని భారీ మానవహారం నిర్వహించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. యువత చురుకైన భాగస్వామ్యం కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చింది. ఈ సందర్భంగా అధికారులు "హెల్మెట్ ధరించండి -- ప్రాణాలు కాపాడుకోండి" అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసి భద్రతపై అవగాహన పెంపొందించారు. హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడే ముఖ్యమైన చర్య అని వారు పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ కోడూరి సుజాత మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుంది. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం వంటి అలవాట్లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి" అని తెలిపారు. మొత్తంగా, వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు సురక్షిత ప్రయాణం వైపు ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది.

# టిబి రోగులకు పోషణ కిట్లు పంపిణీ






### వేసవి తీవ్రత నేపథ్యంలో వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి
### డిఎంహెచ్ఓ డా. ఏ అప్పయ్య

**హన్మకొండ,15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

టిబి ముక్త్ భారత్ అభియాన్ ఫేజ్--2 కార్యక్రమంలో భాగంగా టిబి రోగులకు పోషణ అందించడంతో పాటు, మరోవైపు పెరుగుతున్న వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. బుధవారం సర్వ ప్రేమ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో 100 నిక్షయ్ పోషణ కిట్లను టిబి రోగులకు వారి కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎ. అప్పయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షయ వ్యాధి బాధితులు సమయానికి మందులు తీసుకోవడం ఎంతో కీలకమని, పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. టిబి వ్యాధిపై సమాజంలో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి డా. హిమ బిందు మాట్లాడుతూ, టిబి ముక్త్ భారత్ అభియాన్ ఫేజ్--2లో భాగంగా 14 సంవత్సరాలు పైబడిన వారిని, అలాగే టిబి లక్షణాలు ఉన్న అనుమానితులను మొబైల్ ఎక్స్‌రే ద్వారా స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం ద్వారా సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వ ప్రేమ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి. బాలస్వామి రెడ్డి, కార్యదర్శి హెచ్. ప్రభాకర్, కమిటీ సభ్యులు, సిబ్బంది, జిల్లా టిబి కోఆర్డినేటర్లు, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్లు, హెల్త్ విజిటర్లు తదితరులు పాల్గొన్నారు. ఇక మరోవైపు, వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరింత తీవ్రత పెరిగే అవకాశముందని డా. అప్పయ్య హెచ్చరించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పీహెచ్‌సీలు, పట్టణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకపోవడం మంచిదని, తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే పలుచని కాటన్ దుస్తులు ధరించడం, తలకు టోపీ లేదా రుమాలు కట్టుకోవడం, తరచూ నీరు లేదా ఒఆర్ఎస్ తాగడం అవసరమని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీలు మధ్య మధ్యలో నీడలో విశ్రాంతి తీసుకోవాలని, శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలైన తల తిరగడం, వాంతులు, ఛాతిలో నొప్పి, అధిక అలసట వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే సమీప పీహెచ్‌సీకి వెళ్లి వైద్య సేవలు పొందాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా పిల్లలను ఎండలో ఆడనీయకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అన్ని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాల్లో పంపిణీ జరుగుతోందని తెలిపారు. వడదెబ్బను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎ. అప్పయ్య స్పష్టం చేశారు.




# ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విద్యావ్యవస్థ పుస్తక ఆవిష్కరణ

**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్ :**

కాకతీయ యూనివర్సిటీ చరిత్ర విభాగం అధ్యాపకులు డా. ఆరూరి రంజిత్ కుమార్ రచించిన "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని విద్యావ్యవస్థ" అనే పుస్తక ఆవిష్కరణ ఏప్రిల్ 15 ఉదయం కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె ప్రతాపరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ వీ. రామచంద్రం యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ మనోహర్, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ సురేష్ లాల్, చరిత్ర విభాగాధిపతి డా.రాజ్ కుమార్ తో పాటు చరిత్ర విభాగపు విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ టి.దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం తోటి అధ్యాపకులు చందర్ రావు. రాజేందర్ రెడ్డి, డా. ఆరూరి సూర్యం మరియు డా.కె. రాజయ్య తదితరులు రంజిత్ ను అభినందించారు.



# తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ

### భారీ సభకు సిద్ధం అవుతున్న కార్యకర్తలు

**వరంగల్, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**



తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఆరు జిల్లాల ముఖ్య ప్రతినిధుల సమావేశం జాగృతి కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై, ఈ నెల 25న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపు తిప్పే కొత్త ప్రాంతీయ రాజకీయ శక్తి ఈ నెల 25న ఆవిర్భవించబోతోందని తెలిపారు. మేడ్చల్ జిల్లా మునిరాబాద్‌లోని అద్వైత కన్వెన్షన్‌లో నిర్వహించనున్న ఈ భారీ సభ ద్వారా ప్రజల ఆశయాలను ప్రతిబింబించే కొత్త దిశను చూపించనున్నామని చెప్పారు. ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజిక అసమానతలను తగ్గిస్తూ, యువత మరియు మహిళలకు సమాన అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ కొత్త రాజకీయ శక్తి ముందుకు వస్తోందని ఆయన వివరించారు. కవిత నాయకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ పార్టీ తెలంగాణలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జాగృతి కార్యకర్తలు, ఉద్యమకారులు, బహుజన, గిరిజన, దళిత వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఈ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారుపెల్లి మాధవి, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు పర్లపల్లి శ్రీశైలం, యూత్ రాష్ట్ర నాయకుడు తాడిగోప్పుల మల్లేష్, వరంగల్ మహిళా అధ్యక్షురాలు నూకల రాణి, జిల్లా నాయకులు కుసుమ రాజు, నడిపల్లి వెంకటేశ్వరరావు, సొల్తీ కిషోర్, జున్ను రాజు యాదవ్, రోహిత్ రెడ్డి, రమేష్, జన్ను సంతోష్, జనగాం నాయకులు ఆంజనేయులు, భూపాలపల్లి నుండి నరేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలసదన బాలికలు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





**హన్మకొండ, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

బాలికల భవిష్యత్తు బలంగా ఉండాలంటే విద్యే ప్రధాన ఆధారం అని, బాల సదనంలో ఉన్న ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యాలతో కృషి చేస్తూ బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. బుధవారం హనుమకొండ సుబేదారిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల బాలసదనాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తూ వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికలతో ఆత్మీయంగా మాట్లాడి, వారి విద్యాభ్యాసం, వసతి, ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. బాలసదనంలో ఉన్న విద్యార్థినుల సంఖ్య, వారు అభ్యసిస్తున్న కోర్సులు, వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యతపై విద్యార్థినులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి భోజన నాణ్యతను పరీక్షించారు. వేసవి సెలవుల్లో బాలికల హాజరు, దత్తత ప్రక్రియలపై జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మరియు సూపరింటెండెంట్ కళ్యాణి నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి ఉత్తమ సంరక్షణతో పాటు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. దత్తతకు సంబంధించిన దరఖాస్తులు వచ్చిన పక్షంలో, బాలికల గార్డియన్ సమ్మతితో పారదర్శకంగా, వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థినులు జనరల్ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వివరించగా, కలెక్టర్ వారికి అభినందనలు తెలిపారు.

**పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**

సందర్శన సమయంలో లక్ష్మీ ప్రసన్న అనే బాలికకు పుట్టినరోజు కావడంతో కలెక్టర్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. స్వయంగా దగ్గరకు తీసుకుని ఆశీర్వదించడం ద్వారా బాలికలో ఆనందం నింపారు. అనంతరం బాలికల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూసి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే బాలసదనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం. కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, కౌన్సిలర్లు త్రివేణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# హన్మకొండ డిపోలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆశయాల ఆచరణకు పిలుపు

**సామాజిక సమానత్వం కోసం అంబేద్కర్ చూపిన మార్గం అనుసరించాలి**
**హన్మకొండ లోకల్ డిపోలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు**



**హన్మకొండ, 15 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక న్యాయానికి ప్రతీక అయిన డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హన్మకొండ లోకల్ డిపోలో వేడుకలు ఘనంగా, వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం డిపో మేనేజర్ ధరమ్ సింగ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డిపో ప్రాంగణంలో అంబేద్కర్ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అధికారులు, సిబ్బంది కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో పలువురు వక్తలు అంబేద్కర్ జీవిత విశేషాలు, రాజ్యాంగ రూపకల్పనలో ఆయన కీలక పాత్ర, సామాజిక సమానత్వం కోసం చేసిన నిరంతర పోరాటాన్ని విశదీకరించారు. డిపో మేనేజర్ ధరమ్ సింగ్ నాయక్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎస్సీ-ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ కాందారి సుధాకర్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు సమాజంలో సమాన హక్కుల సాధనకు బలమైన పునాది వేశాయని తెలిపారు. విద్య, చైతన్యం, సంఘటితం అనే ఆయన సిద్ధాంతాలను అనుసరించడం ద్వారా మాత్రమే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. స్టేట్ కమిటీ సభ్యులు ఆకారపు మురళి, తోట శ్రీనివాస్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆలోచనలు యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయని, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యాన్ని ఆయన జీవితం అందిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే అంబేద్కర్ లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నజియా సుల్తానా, ఎం.ఎఫ్. చంద్రశేఖర రావు, హన్మకొండ ఆఫీస్ సిబ్బంది, ప్రెసిడెంట్ పులి రజిత, డిపో కమిటీ సభ్యులు బోడ రవి, చక్రి, హన్మకొండ డీఐ ప్రకాష్, గిన్నారపు సంపత్, ఏడిసి ఎమ్మార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ, సమాజంలో ఉన్న అసమానతలను తొలగించి సమగ్ర అభివృద్ధి సాధించేందుకు అందరూ కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ వేడుకలు డిపో సిబ్బందిలో చైతన్యం నింపడంతో పాటు, అంబేద్కర్ ఆలోచనలను మరింత విస్తరించే వేదికగా నిలిచాయి.

# డాక్యుమెంటేషన్ వర్తమాన సమాజానికి మార్గదర్శి - కేయూ విసి



**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**

హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రజా సంబంధాల (పి ఆర్ ఓ) కార్యాలయం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి సంబంధించిన పత్రికా, మీడియా క్లిప్పింగ్స్ వార్షిక నివేదికను ఘనంగా విడుదల చేశారు. ఈ నివేదికను కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం , ఓ.ఎస్.డి ఆచార్య వెంకట్రాంరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మాన్యువల్ డాక్యుమెంటేషన్ ప్రస్తుత సమాజంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో కూడా పత్రాల రూపంలో సమాచారాన్ని భద్రపరచడం అవసరం తగ్గలేదని స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు సరైన ఆధారాలు అందించడంలో డాక్యుమెంటేషన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాల పౌర సంబంధాల విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం విశేష ప్రాశస్త్యాన్ని సంతరించుకుందని తెలిపారు. వివిధ సందర్భాల్లో పత్రికలు, మీడియా ద్వారా వెలువడిన వార్తలను ఒకే చోట సమగ్రంగా సమీకరించడం విద్యాసంస్థకు గౌరవాన్ని తీసుకువస్తుందని అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలో కళాశాల కార్యకలాపాలు, విజయాలు, సంఘటనలు పత్రికలు, ఇతర మాధ్యమాలలో ప్రచురితమవుతాయని పేర్కొన్నారు. వాటిని గ్రంథరూపంలో సమీకరించడం ద్వారా సంస్థ చరిత్రను భద్రపరచడం సాధ్యమవుతుందని వివరించారు. ఈ దిశగా పబ్లిక్ రిలేషన్స్ విభాగం చేసిన కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ మాజీ ఈసీ సభ్యులు ఆచార్య బత్తిని చంద్రమౌళి, కళాశాల మాజీ ప్రిన్సిపల్ రెహ్మాన్, ఆర్ట్స్ కళాశాల పౌర సంబంధాల అధికారి డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఆశీర్వాదం, డాక్టర్ శ్రీధర్ కుమార్, డాక్టర్ సుచరిత, డాక్టర్ జితేందర్, హరికుమార్, కేయూ పీఆర్ఓ డాక్టర్ పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేటలో "అరైవ్ అలైవ్" ప్రచారంతో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన






**వరంగల్, 15 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా, "అరైవ్ అలైవ్" ప్రచార కార్యక్రమాలు కాజీపేట పరిధిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈ అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కలిగించాయి. ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సెంట్రల్ జోన్ డీసీపీ, ఈస్ట్ జోన్ డీసీపీ, ఏఎస్పీ వరంగల్, ఏసీపీ ట్రాఫిక్, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. వెంకన్న, మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొని మానవహారం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యం కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకువచ్చింది. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే దిశగా అధికారులు సందేశాలు ఇచ్చారు. లారీ డ్రైవర్లకు హెల్మెట్లు పంపిణీ చేయడం ద్వారా భద్రతా చర్యల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇదే క్రమంలో కాజీపేటలోని బిషప్ బెరెట్టా హైస్కూల్‌లో మరో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌హెచ్‌ఓ సుదాకర్ రెడ్డి, ఎస్‌ఐ లవన్, పోలీసు సిబ్బంది సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.



ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించడం, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. అలాగే విద్యార్థులకు రోడ్డు భద్రత ప్రమాణం చేయించి, భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందితే ప్రమాదాలు తగ్గుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలు ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యాన్ని పెంచడమే కాకుండా, బాధ్యతాయుత డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడంలో కీలకంగా మారాయి. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత ముఖ్యమని, నిబంధనలు పాటించడం ద్వారా మాత్రమే ప్రాణాలను కాపాడుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# కేయూ యూత్ స్పోర్ట్స్ ఫెస్టివల్ ప్రారంభం

**ప్రారంభించిన కె యూ వీసీ, రిజిస్ట్రార్లు...**

**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్ :**



వరంగల్ లో కేయూ యూత్ స్పోర్ట్స్ ఫెస్టివల్ ఘనంగా ప్రారంభమైంది. స్పోర్ట్స్ బోర్డ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ సహకారంతో, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలను కేయూ వీసీ ప్రొ. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొ. మామిడాల ఇస్తారి మాట్లాడుతూ, ఈ ఫెస్టివల్‌లో క్రికెట్, వాలీబాల్, ఖో ఖో తో పాటు 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం వంటి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లలో ఫార్మసీ కాలేజీ, యూనివర్సిటీ కాలేజీ, ఎడ్యుకేషన్ కాలేజీ, కామర్స్ కాలేజీ, ఎస్.డీ.ఎల్.సీ.ఈ (ఎం.సి.ఏ), ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు సుబేదారి ఆర్ట్స్ కాలేజీ, పీజీ కాలేజీ, లా కాలేజీ విద్యార్థులు పాల్గొననున్నారని వివరించారు. క్రికెట్ కోసం 26 జట్లు, వాలీబాల్ (మెన్స్, ఉమెన్స్) కోసం 21 జట్లు పోటీపడనున్నాయని తెలిపారు. ఈరోజు క్రికెట్ ఫస్ట్ రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయని, మొత్తం 12 రోజుల పాటు ఈ టోర్నమెంట్‌లు కొనసాగనున్నాయని చెప్పారు. నిర్వహణ కమిటీ...ఈ టోర్నమెంట్‌ల నిర్వహణ బాధ్యతలను స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొ. వెంకయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. పీ. భాస్కర్ కన్వీనర్లుగా చేపట్టగా, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్లు డా. బీ. నిరంజన్ శ్రీనివాస్, డా. టీ. రాధికలు కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు. అదనంగా డా. ఏ.టి.బీ.టీ. ప్రసాద్ కో-కోఆర్డినేటర్‌గా, డా. ఎస్. కుమార్, ఎం.డి. లాల్ సాహెబ్, సీ.హెచ్. బుచ్చయ్య, ఎం. అన్వేష్, ఎన్. సుమన్ లు వివిధ పోటీల నిర్వహణ ఇంచార్జీలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సమన్వయ బృందం సమగ్రంగా పనిచేస్తూ, పోటీలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసిందనీ ప్రొ మామిడాల ఇస్తారి తెలిపారు. క్రీడలే వ్యక్తిత్వ వికాసానికి పునాది - - కేయూ వీసీ ప్రొ. ప్రతాప్ రెడ్డి పోటీలను ప్రారంభించిన వీసీ ప్రొ. ప్రతాప్ రెడ్డి,రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం మాట్లాడుతూ, విద్యార్థులలో క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం, జట్టు భావన పెంపొందించడమే కాకుండా, క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపుకు, సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ, సహనశక్తి, పరస్పర సహకారం వంటి విలువలను నేర్చుకుంటారని, ఇవి వారి విద్యా ప్రస్థానంలోనే కాకుండా భవిష్యత్తు జీవితంలో కూడా ఉపయోగపడతాయని అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎల్లప్పుడూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని, ఈ స్పోర్ట్స్ ఫెస్టివల్ ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని వీసీ, రిజిస్ట్రార్‌లు అభిప్రాయపడ్డారు. ఈ యూత్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో పాలక మండలి సభ్యులు డా సుదర్శన్, డా చిర్ర రాజు, డెవెలప్మెంట్ ఆఫీసర్ ప్రొ. వాసుదేవ రెడ్డి, బీసీ సెల్ డైరెక్టర్ డా బోడిగ సతీష్, సిఫ్రాక్ డైరెక్టర్ డా శాస్త్రి, డా. పుల్ల శ్రీనివాస్, కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. నరసింహ చారీ, లైబ్రరీ ఇంచార్జి డా. రాధిక లతో బాటు ప్రొ వెంకయ్య, డా భాస్కర్, డా కుమార్, డా ప్రసాద్, డా. గోపీనాథ్ మరియు కేయూ ఇతర టీచర్లు పాల్గొన్నారు.

# చెరువులో పడిపోయి మత్స్యకారుడు గల్లంతు - వడ్డేపల్లిలో కలకలం

**కాజీపేట, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లాలోని వడ్డేపల్లి చెరువులో అనుమానాస్పద పరిస్థితుల్లో ఓ మత్స్యకారుడు గల్లంతైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బుధవారం సాయంత్రం సుమారు 4:40 గంటల సమయంలో చేపలు పట్టే క్రమంలో చెరువులో పడిపోయినట్లు సమాచారం. గల్లంతైన వ్యక్తి కళ్ళైబోయిన క్రాంతి కుమార్ (40), తండ్రి చెరాలు, వడ్డేపల్లి ముదిరాజ్‌వాడకు చెందినవాడు. వృత్తిరీత్యా మత్స్యకారుడైన క్రాంతి కుమార్ సాధారణంగా చేపల వేటలో నిమగ్నమై ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు స్పందించి ఎస్.డి.ఆర్.ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్.డి.ఆర్.ఎఫ్ సిబ్బంది చెరువులో గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మరంగా శోధన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుండగా, ఘటనపై అనుమానాస్పద కోణాల్లో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇంటర్ ఫలితాలలో కార్పొరేట్ కాలేజీలకు దీటుగా మార్కులు సాధించిన జె. ఏం. జె.కాలేజ్ విద్యార్థిని

**వై. ఎస్.ఆర్. కడప / జై భీమ్ న్యూస్ :**



ఇంటర్మీడియట్ ఫలితాలలో కార్పొరేట్ కాలేజీ లకు దీటుగా కడప టౌన్ జె. ఏం. జె. బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థిని రూపశ్రీ వెయ్యి కి గాను తొమ్మిది వందల డెబ్బై తొమ్మిది సాధించ్చిందని కాలేజీ ప్రిన్సిపాల్ సిస్టర్. రోశ్రాని తెలియజేశారు. అతి తక్కువ ఫీజు తోటి పిల్లలకు నాణ్యమైన విద్యను ఇవ్వడమే కాకుండా, ఈవెనింగ్ టైం లో స్టడీ హావర్స్ ఏర్పాటు చేసి ఎలాంటి డౌట్స్ అయినా క్లియర్ చేయిస్తూ స్టూడెంట్స్ కి మంచి భవిషత్తు ఇవ్వడం కాలేజీ ప్రత్యేకత అని అందుకు అనుగుణంగా విద్యను అందించినందుకు ప్రతి లెక్చరర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు .అనంతరం రూపశ్రీ మాట్లాడుతూ నాకు 979 మార్కులు రావడానికి ప్రిన్సిపాల్ సిస్టర్ రోశ్రాని, లెక్చరర్స్ ప్రోత్సహం వల్ల మా తల్లిదండ్రుల నమ్మకాన్ని నిజం చేయగలిగానని విద్యానందించిన గురువులను కొనియాడారు.

# ఎంజీఎంలో 'ముసుగు వేసుకున్న కృష్ణుడి లీలలు'

**నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్‌తో ఉద్యోగం**
**యంత్రాంగం మౌనం వెనుక ఏముంది..?**
**వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వెలుగులోకి వస్తున్న బోగస్ నియామకాల వ్యవహారం**
**సాధారణ అవకతవక కాదనే అనుమానాలు బలపడుతున్నాయి.**

**ఎంజీఎం / జై భీమ్ న్యూస్ :**

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో "ముసుగు వేసుకున్న కృష్ణుడి లీలలు"గా వెల్లువెత్తుతున్న ఈ ఘటన, ప్రభుత్వ నియామక వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తోంది. ముసుకు కృష్ణ (తండ్రి: వీరమల్లు) అనే వ్యక్తి ఎంజీఎం ఆసుపత్రిలో టైపిస్టుగా జాబు సంపాదించి ప్రస్తుతం పెన్షన్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే, అతని నియామకం మొదటి నుంచే అనుమానాస్పదమని పలు సంఘాలు ఆరోపిస్తున్నాయి. నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్‌తో ఉద్యోగం. ఆరోపణల ప్రకారం, 25 డిసెంబర్ 2010న జారీ అయిన సదరం సర్టిఫికెట్‌ను అడ్డంగా పెట్టుకుని, తాను దివ్యాంగుడినని నమ్మించి ఉద్యోగం పొందినట్లు చెబుతున్నారు. కానీ వాస్తవానికి: అతను అసలు దివ్యాంగుడు కాదని ఒరిజినల్ దివ్యాంగుల అవకాశాలను దోచుకున్నాడని నకిలీ పత్రాలతో ప్రభుత్వాన్ని మోసం చేశాడని ఎంఆర్పీఎస్ , ఎంఎస్పీ , వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

**ఫిర్యాదులు ఉన్నా... విచారణలో నిశ్శబ్దం ఎందుకు..?**

ఈ అంశంపై గతంలోనే వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన పురోగతి లేకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ప్రశ్నలు మరింత గట్టిగా వినిపిస్తున్నాయి . ఫిర్యాదు చేసిన తర్వాత కూడా విచారణ ఎందుకు ముందుకు సాగడం లేదు..? సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణం ఏమిటి..? ఇది కేవలం నిర్లక్ష్యమా..? లేక ఎవరో వీరిని కాపాడుతున్నారా..? "అధికారులు కేవలం లేఖలకే పరిమితమయ్యారు" అనే విమర్శలు క్షేత్రస్థాయిలో వినిపిస్తున్నాయి. ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలు ఎందుకు లేవు..? ఇంత పెద్ద ఆరోపణల మధ్య, ముసుకు కృష్ణకు ఇప్పటివరకు ఫిజికల్ ఫిట్నెస్ లేదా వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం మరింత సందేహాలకు దారితీస్తోంది.

**నాయకులు ప్రశ్నిస్తున్నారు:**

నిజంగా దివ్యాంగుడు అయితే పరీక్షలు చేయడానికి భయం ఎందుకు..? పరీక్షలు చేయకపోవడం వెనుక ఒత్తిళ్లు ఉన్నాయా..? ఇది మొత్తం వ్యవస్థ పారదర్శకతపై ప్రశ్నార్థకం వేస్తోంది.

**పదోన్నతుల దిశగా అడుగులు – మరింత వివాదం**

ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, ఈ ఆరోపణల మధ్యనే ముసుకు కృష్ణ పదోన్నతుల కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అంటే అక్రమంగా ఉద్యోగం పొందిన వ్యక్తి అదే వ్యవస్థలో పదోన్నతులు పొందే పరిస్థితి ఇది నిజమైతే, వ్యవస్థలో అవినీతి ఎంత లోతుగా ఉందో స్పష్టమవుతోంది.

**సంఘాల ఆగ్రహం – కఠిన చర్యల డిమాండ్**

ఈ ఘటనపై ఎంఎస్పీ రాష్ట్ర నేతలు బిరు మహేందర్ మాదిగ, తడుగుల విజయ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ, బాబురాజు యాదవ్, కన్నెబోయిన తదితరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు డిమాండ్ చేసిన ముఖ్య అంశాలు: ప్రత్యేక వైద్య బృందంతో వెంటనే శారీరక స్థితి పరీక్షలు చేయాలి నకిలీ సర్టిఫికెట్ నిర్ధారణ అయితే వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి "నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు దక్కించుకోవడం వల్ల నిజమైన దివ్యాంగులు తీవ్రంగా నష్టపోతున్నారు" అని వారు మండిపడ్డారు.

**అధికారులపై తీవ్ర విమర్శలు**

ఈ వ్యవహారంలో అధికారులు తీసుకుంటున్న తీరుపై బాధితులు, సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "అక్రమాలకు కొమ్ముకాస్తున్న అధికారుల వల్లే ఇలాంటి సంఘటనలు పెరుగుతున్నాయి" అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**హెచ్చరిక – ఉద్యమం ఉధృతం**

కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని చర్యలు తీసుకోకపోతే: పెద్ద ఎత్తున నిరసనలు, ఉద్యమాలు చట్టపరమైన పోరాటం చేస్తామని దివ్యాంగ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. సంక్షేపంగా – ఇది ఒక్క కేసేనా..? లేక పెద్ద స్కాం సంకేతమా..? ఎంజీఎం ఆసుపత్రిలో బయటపడిన ఈ ఘటన కేవలం ఒక వ్యక్తి తప్పిదం కాదు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది నియామక వ్యవస్థలో లోపాలా..? లేక పద్ధతి ప్రకారం జరుగుతున్న అక్రమాల శృంఖలమా..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు అధికారులపై ఉంది. ఈ కేసులో కఠిన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో నిజమైన అర్హుల హక్కులు పూర్తిగా నశించే ప్రమాదం ఉంది.




# మహిళా వ్యాపారి ఆత్మహత్యాయత్నం ఆరోపణలతో కొత్త మలుపు?

**లైసెన్స్ మంజూరుపై అనుమానాలు**
**ఏనుమాముల మార్కెట్ మిర్చి వ్యాపారి వివాదం మరింత ముదురుతోంది**
**రూ.3 కోట్ల ఐపీ ఆరోపణలు - మహిళా వ్యాపారి కేంద్రంగా వివాదం.**
**గతంలో జమ్మికుంట మార్కెట్లో భర్త.. ఇప్పుడు ఎనుమాములలో భార్య?**
**లైసెన్స్ మంజూరులో అధికారుల పాత్రపై ప్రశ్నలు..?**
**సూసైడ్ డ్రామా.. బెదిరింపులతో 3 కోట్లు ఎగనామం చేయాలన్నదే ప్లాన్ అంటున్న వ్యాపారులు..!!**
**ఒక్కసారి జమ్మికుంటలో.. రెండో సారి ఎనుమాములలో... ఇలా వదిలేస్తే మరో దగ్గర మోసం చేస్తారు అంటున్న బాధితులు**
**డబ్బులు బంగారం రూపంలోకి మార్చారు?.. కొంత నగదు బంధువుల దగ్గర ఉన్నట్లు సమాచారం?**
**పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్న బాధితులు**

**ఏనుమాముల మార్కెట్ / జై భీమ్ న్యూస్ :**

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఓ మహిళ వ్యాపారి ఆర్థిక వివాదం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. మహిళా వ్యాపారి పేరిట నడుస్తున్న ట్రేడింగ్ సంస్థ ద్వారా సుమారు రూ.3 కోట్ల మేర లావాదేవీల్లో అవకతవకలు జరిగి ఐపీ పెట్టినట్లు వ్యాపార వర్గాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక వ్యాపారుల ప్రకారం, సదరు మహిళా వ్యాపారి భర్త గతంలో జమ్మికుంట మార్కెట్‌లో వ్యాపారం నిర్వహించిన సమయంలో కూడా ఆర్థిక వివాదాల్లో ఇరుక్కున్నట్లు ప్రచారం జరుగుతోంది. అప్పట్లో కోట్ల రూపాయల లావాదేవీలకు సంబంధించి సమస్యలు తలెత్తిన తర్వాత, ఆయన అక్కడి నుంచి వరంగల్ మారినట్లు సమాచారం. తరువాత ఏనుమాముల మార్కెట్‌లో భార్య పేరిట కొత్తగా లైసెన్స్ తీసుకుని మిర్చీ వ్యాపారం ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే, జమ్మికుంటలో లైసెన్స్ మంజూరు చేసిన అధికారే, ఏనుమాముల మార్కెట్‌లో కూడా అదే కుటుంబానికి చెందిన వ్యక్తికి లైసెన్స్ ఇవ్వడంలో పాత్ర వహించారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, లైసెన్సింగ్ ప్రక్రియలో సరైన పరిశీలన జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత చరిత్ర ఉన్న వ్యక్తులకు మరోసారి పరోక్షంగా లైసెన్స్ మంజూరు అయ్యిందా అనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఈ వివాదం మధ్యలో కొత్త మలుపు తిరిగింది. సదరు మహిళా వ్యాపారి తన భర్తను పోలీసులు అదుపులో ఉంచినట్లు ఆరోపిస్తూ, బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఈ మేరకు ఆమె ఒక లేఖ కూడా రాసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడాల్సి ఉంది. వ్యాపార వర్గాలు మాత్రం ఈ చర్యలను విచారణను ప్రభావితం చేసే ప్రయత్నంగా చూస్తున్నాయి. ఆరోపణల తీవ్రత దృష్ట్యా, గత లావాదేవీలు, నమోదైన కేసులు, లైసెన్స్ మంజూరు ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలని పోలీసులను, మార్కెట్ శాఖను కోరుతున్నారు. "నిజాలు వెలుగులోకి రావాలంటే పూర్తిస్థాయి దర్యాప్తు అవసరం" అని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే బాధితులు మాత్రం సూసైడ్ అటెంప్ట్ చేసిన మహిళా వ్యాపారికి సూటిగా కొన్ని ప్రశ్నలు అడుగుతున్నారు...

1. గతంలో జమ్మికుంటలో వ్యాపారం పేరిట మీ భర్త రెండు కోట్లు లాస్ చేసి వరంగల్ కు వచ్చింది నిజమా కాదా?
2. ఇప్పుడు వరంగల్ ఎనుమాముల మార్కెట్లో మీ పేరు మీద అడ్తి దుకాణం లైసెన్స్ ఉందా? లేదా? ఉంటే అనుమతి ఇచ్చింది ఎవరు? ఇప్పించింది ఎవరు?
3. మూడు కోట్లకు పైగా లావాదేవీలు చేసి ఐపి పెట్టి గత కొన్ని రోజులుగా తప్పించుకు తిరుగుతున్న మిమ్మల్ని పోలీసులు కేసు నమోదు చేసి విచారించాలా? వద్దా?
4. ఇంతమంది వ్యాపారుల నుండి డబ్బులు వసూలు చేసి ఆ డబ్బులు ఎక్కడున్నాయో చెప్పకుండా తప్పించుకొని తిరగడం ఎంతవరకు సమంజసం?
5. మూడు కోట్ల రూపాయల డబ్బులు ఎక్కడికి వెళ్లాయి ఎవరి దగ్గర ఉన్నాయి?
6. నష్టపోయిన వ్యాపారులకు రైతులకు డబ్బులు ఎవరు చెల్లిస్తారు?
7. గతంలో జమ్మికుంటలో ఐపి పెట్టి వచ్చిన మీకు ఎనుమాముల మార్కెట్లో లైసెన్స్ ఇప్పించిన మార్కెటింగ్ శాఖ అధికారి ఎవరు?
8. పారదర్శకంగా పోలీసులు విచారణ చేస్తుంటే పోలీసులపై తప్పుడు ప్రచారం చేయడం సమంజసమా?
9. విచారణ చేస్తేనే కదా అసలు డబ్బులు ఎక్కడికి వెళ్లాయి ఎవరి దగ్గర ఉన్నాయి అనే విషయాలు బయటకు వస్తాయి?
10. సూసైడ్ చేసుకున్నానని చెప్పి పోలీసుల విచారణను అడ్డుకోగలగవచ్చు అంటూ మీకు సలహాలు ఇచ్చిన వ్యక్తి ఎవరు?
11. గతంలో మీకు ఏదైతే న్యాయం జరిగిందో ఇప్పుడు బాధితులకు కూడా అదే న్యాయం జరగాలా వద్దా?
12. వ్యాపారంలో నష్టాలు జరుగుతూనే ఉంటాయి.. కానీ ఒకసారి మార్కెట్ లో ఐపీ పెట్టిన వ్యక్తి.., మరోసారి మరో మార్కెట్లో ఐపి పెట్టడం ఎలా సాధ్యం..?

సూసైడ్ అనే పేరుతో ఎందరిని భయపెడతారు అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.




# టీజీ ఎడ్.సెట్-2026 దరఖాస్తుల గడువు ఏప్రిల్ 22 వరకు పొడిగింపు

**హైదరాబాద్, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహించబడనున్న టీజీ ఎడ్ .సెట్ --2026 ద్వారా బి.ఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఏప్రిల్ 22 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా పొడిగించినట్లు కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకోలేకపోయిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు గడువు ముగియకముందే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు అర్హతలు, దరఖాస్తు విధానం, ఫీజు వివరాలు తదితర సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని ఆయన వెల్లడించారు. అధికారిక వెబ్‌సైట్: https://edcet.tgche.ac.in ఈ సందర్భంగా అధికారులు, చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.




# అర్హత కలిగిన వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే కంటి అద్దాలు ఇవ్వాలి: జిల్లా వైద్యాధికారి డా. అప్పయ్య




**హన్మకొండ, ఏప్రిల్ 15 (జై భీమ్ న్యూస్)**

అర్హత కలిగిన కంటి వైద్య నిపుణుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే ఆప్టికల్ షాపుల వారు కంటి అద్దాలు తయారు చేసి ఇవ్వాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య ఆదేశించారు. బుధవారం హనుమకొండలోని పలు ఆప్టికల్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, ఆప్టికల్ షాపులు కంటి దవాఖాన బోర్డులు పెట్టుకోవడం అనుమతించబడదని స్పష్టం చేశారు. ఒకవేళ అలాంటి బోర్డులు ఉంటే, తప్పనిసరిగా అర్హత కలిగిన కంటి వైద్యుడు అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అర్హత లేని వ్యక్తులు కంటి పరీక్షలు నిర్వహించడం, కంటి అద్దాలు సూచించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అర్హత కలిగిన వైద్యులు సూచించిన మేరకు మాత్రమే కళ్ళజోడులు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించిన షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకొని అవసరమైతే మూసివేయబడతాయని ఆయన స్పష్టం చేశారు. ఇకపై ఉచిత కంటి పరీక్షలు -- అద్దాలు వంటి తప్పుదారి పట్టించే ప్రకటనలు బోర్డుల రూపంలో ప్రదర్శించరాదని కూడా ఆయన సూచించారు. ఈ తనిఖీలలో స్టాటిస్టికల్ అధికారి ప్రసన్నకుమార్ రంజిత్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ ప్రశంసలు





**హన్మకొండ, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ ఉ కళాశాలల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లాకు చెందిన కేజీబీవీలు, మోడల్ విద్యాసంస్థలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ విద్యా ప్రస్థానం, సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాల గురించి వివరించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సమగ్ర సౌకర్యాలు, ప్రోత్సాహక చర్యలు, తల్లిదండ్రులు మరియు అధ్యాపకుల సమిష్టి కృషి వల్లే విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించగలిగారని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా ప్రతిభ చాటడం గర్వకారణమని పేర్కొన్నారు. రాబోయే జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సమగ్రంగా సన్నద్ధమవ్వాలని, అలాగే యూపీఎస్సీ, గ్రూప్స్ వంటి ఉన్నత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, స్పష్టమైన లక్ష్యంతో కష్టపడితే విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు 990కి పైగా మార్కులు సాధించడం విశేషమని, ఇది జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే విజయం సాధించగలడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 36 మంది మెరిట్ విద్యార్థులను కలెక్టర్, అదనపు కలెక్టర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. సంబంధిత కళాశాలల అధ్యాపకులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, జీసీడీఓ సునీత, వివిధ కళాశాలల అధ్యాపకులు, మెరిట్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై ప్రైవేట్ స్కూల్స్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి





జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో రోడ్డు భద్రతకు మరింత ప్రాధాన్యం కల్పిస్తూ బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో "అరైవ్ అలైవ్" కార్యక్రమం కింద ప్రైవేట్ స్కూల్ డ్రైవర్స్ యూనియన్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధ్యక్షత వహించగా, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీఈవో రంగయ్య నాయుడు, డిబిసిడిఓ పుష్పలత, ట్రాఫిక్ సీఐ సుజాత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణ భద్రత అత్యంత ప్రాధాన్యమైన అంశమని స్పష్టం చేశారు. ప్రైవేట్ స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఓవర్ స్పీడ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం తమ ప్రధాన కర్తవ్యమని తెలిపారు. స్కూల్ బస్సుల్లో డ్రైవర్‌తో పాటు క్లీనర్ తప్పనిసరిగా ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, వాహనాల హెడ్‌లైట్లకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు అమర్చాలని సూచించారు. ప్రతి బస్సుకు ఫిట్నెస్ సర్టిఫికేట్ ఉండాలని, రహదారులపై ప్రత్యేకంగా హైవే కూడళ్ల వద్ద ఉన్న పాఠశాలల సమీపంలో "స్కూల్ జోన్" సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా రిక్వెస్ట్ లెటర్లను పంపించి కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని డీఈవో రంగయ్య నాయుడుకు సూచించారు. సమీక్ష సమావేశంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించే వీడియోలను పీపీటీ రూపంలో ప్రదర్శించారు. అధికారులు మాట్లాడుతూ "ప్రాణం అమూల్యమైనది" అని, ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి కట్టుబడి ఉండాలని సూచించారు. ముఖ్యంగా స్కూల్ బస్సుల్లో విద్యార్థుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని, డ్రైవర్లు మరియు క్లీనర్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న అధికారులు, డ్రైవర్లు రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సుజాత, మండలాల ఎంఈఓలు, ఆర్టీఏ అధికారులు, ఎస్సై వేణు, ప్రైవేట్ స్కూల్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధనకై పోరుబాట - ఉద్యోగ సంఘాల జేఏసీ



**హన్మకొండ, 15 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రకటించింది. టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బజ్ పాయ్, ఐఏఎస్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల సాధన కోసం ఈ నెల 17న భోజన విరామ సమయంలో అన్ని మండల కేంద్రాలు మరియు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమానికి డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లింగారెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యనాయక్ ఇంచార్జిలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని పేర్కొన్నారు. అదేవిధంగా మే 5న జిల్లా కేంద్రాల్లో సామూహిక దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జూన్ 2లోపు పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఆకవరపు శ్రీనివాస్ కుమార్, బైరి సోమయ్య, అన్వర్, పెండెం రాజు, కె. శ్రీనివాస్, సర్వర్ హుస్సేన్, పుల్లూరు వేణుగోపాల్, పనికేల రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, రాము నాయక్, కోమల్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, సబీర్, సీతారాం, సరస్వతి, శ్యాంసుందర్, మల్లారెడ్డి, రవిప్రకాష్, విజయ్ కుమార్, రాజమౌళి, రజిత, నాగరాణి, అశోక్, ప్రణయ్, పృథ్వి, అఫ్జల్, కుమారస్వామి, వీరన్న, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై మొక్కజొన్నలు.. ద్విచక్రవాహనదారుడికి గాయాలు

**జనగామ జిల్లా/ పాలకుర్తి, 15 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**



పాలకుర్తి మండల కేంద్రం నుంచి విస్నూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఆరబోసిన మొక్కజొన్నలు ప్రమాదానికి కారణమయ్యాయి. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో విస్నూర్ గ్రామానికి చెందిన రమేష్ రావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న ధాన్యంపై జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నట్లు సమాచారం. రహదారులపై పంటలు ఆరబోసడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇలాంటి పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు. పాలకుర్తి ప్రాంతంలో రహదారులపై విచ్చలవిడిగా మొక్కజొన్నలు ఆరబోసుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపై ధాన్యం ఆరబోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు ధాన్యం అవసరం అయినప్పటికీ, ప్రాణాలు పోతే బాధ్యత ఎవరిది? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## హుజూరాబాద్‌లో ఏఈ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబాటు




**హుజూరాబాద్, 15 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హుజూరాబాద్ మున్సిపాలిటీలో అవినీతి మరోసారి వెలుగుచూసింది. మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నుసుం సుధాకర్ రెడ్డి రూ.50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులకు సంబంధించిన బిల్లును ప్రాసెస్ చేయడానికి ఆయన లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో అధికారులు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద డబ్బు స్వీకరిస్తున్న సమయంలో సుధాకర్ రెడ్డిని పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అతన్ని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో హుజూరాబాద్ మున్సిపాలిటీలో అవినీతి వ్యవహారాలపై మరోసారి చర్చ మొదలైంది.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి అందరికీ ఆహ్వానం

**ఎల్కతుర్తి, ధర్మసాగర్ / జై భీమ్ న్యూస్ :**




భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయానికి ప్రతీక అయిన భారత రత్న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎల్కతుర్తి గ్రామంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం 2026 ఏప్రిల్ 16వ తేదీ మధ్యాహ్నం 12.00 గంటలకు ధర్మసాగర్ మండలం, హనుమకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తి గ్రామంలో నిర్వహించబడనుంది. ఈ మహోత్సవానికి పలు ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. అనంతరం ఆయన సమాజ అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రసంగాలు నిర్వహించబడతాయి. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ, సామాజిక, యువజన సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు. మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి గ్రామ పెద్దలు, యువకులు, సంఘాల ప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,63,431



**పాలకుర్తి, 15 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి భక్తుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. ఆలయ హుండీలో సమర్పించిన కానుకల లెక్కింపులో మొత్తం రూ.2,63,431 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు వెల్లడించారు. 2025 మే 08 నుండి 2026 ఏప్రిల్ 15 వరకు, మొత్తం 250 రోజుల పాటు భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం ఆలయంలో లెక్కించారు. ఈ లెక్కింపు ప్రక్రియను పాలకుర్తి ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న పర్యవేక్షణలో నిర్వహించారు. హుండీలో భారత కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ కూడా లభించింది. ముఖ్యంగా అమెరికన్ డాలర్లు -- 20 డాలర్ ఒకటి, 1 డాలర్ ఒకటి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో గ్రామ సర్పంచ్ నీరటి లక్ష్మి చంద్రయ్య, ఆలయ అర్చకులు కళ్యాణ సుందరాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పాలెం సత్తయ్య, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రాణ రక్షణకు గ్రామం ముందడుగు

**గంటూరుపల్లిలో హెల్మెట్ తప్పనిసరి నిర్ణయం**

**కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా 100 హెల్మెట్ల పంపిణీ**

**సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి స్వయంగా హెల్మెట్లు దానం**

**ఇతర గ్రామాలకు ఆదర్శంగా గంటూరుపల్లి నిర్ణయం**





**హన్మకొండ జిల్లా/హాసన్ పర్తి, 15 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు హాసన్ పర్తి మండలంలోని గంటూరుపల్లి గ్రామంలో గ్రామ సభ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామంలోని మోటారు వాహనదారులు 100 శాతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని అమలు చేసే భాగంగా కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి గ్రామ ప్రజలకు 100 హెల్మెట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి కూడా స్వయంగా హెల్మెట్లు దానం చేసి రోడ్డు భద్రత పట్ల తన నిబద్ధతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే ముఖ్యమైన రక్షణ సాధనమని ఆయన పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. హాసన్ పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని, పోలీస్ శాఖ తరఫున రోడ్డు భద్రతపై మరింత అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. గ్రామ సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతే తమ లక్ష్యమని, అందుకే ఈ తీర్మానం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థులు ఈ నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేసి, హెల్మెట్ ధరించడం రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హాసన్ పర్తి ఎస్ఐ దేవేందర్, ఉప సర్పంచ్, పంచాయతీ రాజ్ ఏఈ, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

భారత ప్రభుత్వం రేపు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు.

# లక్నోతో మ్యాచ్: టాస్ గెలిచిన ఆర్సీబీ... ఇంపాక్ట్ ప్లేయర్‌గా కోహ్లీ

**లక్నోతో మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న ఆర్సీబీ**

**ఆర్సీబీ జట్టులోకి తిరిగి వచ్చిన పేసర్ జోష్ హేజిల్‌వుడ్**

**లక్నో సూపర్ జెయింట్స్ ఎటువంటి మార్పులు లేకుండా బరిలోకి**

**గత మ్యాచ్‌లో ముంబైపై నెగ్గిన ఆర్సీబీ, గుజరాత్‌తో ఓడిన లక్నో**

ఐపీఎల్ లో ఇవాళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) మధ్య మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్ కోసం ఆర్సీబీ ఒక మార్పు చేసింది. స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ తిరిగి జట్టులోకి రాగా, జాకబ్ డఫీకి విశ్రాంతినిచ్చింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగనున్నాడు. మరోవైపు, లక్నో సూపర్ జెయింట్స్ ఎటువంటి మార్పులు లేకుండానే ఆడుతోంది. టాస్ గెలిచిన అనంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ మాట్లాడుతూ, "మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇది మంచి సర్ఫేస్‌లా కనిపిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసి, దాని ప్రయోజనాన్ని పొంది ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాలనుకుంటున్నాం. గత మ్యాచ్‌లో పిచ్‌పై చాలా గడ్డి ఉంది, కానీ ఈ వికెట్‌పై గడ్డి లేదు. ఇది బ్యాటింగ్‌కు మంచి ట్రాక్ అవుతుందని భావిస్తున్నా" అని తెలిపాడు. టాస్ ఓడినప్పటికీ ఎల్ఎస్‌జీ కెప్టెన్ రిషబ్ పంత్ ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. "ఇది బ్యాటింగ్‌కు అనుకూలమైన మంచి వికెట్. ఇలాంటి పిచ్‌లపై ముందు బ్యాటింగ్ చేసినా, బౌలింగ్ చేసినా పెద్ద తేడా ఉండదు. అంతిమంగా మేం మెరుగైన క్రికెట్ ఆడటమే ముఖ్యం. ఒక జట్టుగా మేం పుంజుకుని, మా పాత్రలకు న్యాయం చేయాలి. ప్రతి ఒక్కరూ జట్టు కోసం మ్యాచ్ గెలిపించే ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నాం" అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌కు ఆర్సీబీ మంచి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. గత మ్యాచ్‌లో ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌పై 57 పరుగుల భారీ తేడాతో గెలిచింది. మరోవైపు, లక్నో తన సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమి పాలైంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆర్సీబీ మూడో స్థానంలో ఉండగా, ఈ మ్యాచ్ గెలిచి అగ్రస్థానానికి చేరాలని చూస్తోంది. నాలుగు మ్యాచ్‌లలో రెండు విజయాలతో లక్నో ఏడో స్థానంలో కొనసాగుతోంది. ఇరు జట్ల మధ్య ముఖాముఖి పోరులో ఆర్సీబీ స్పష్టమైన ఆధిపత్యం కనబరుస్తోంది. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌లలో బెంగళూరు నాలుగు విజయాలు సాధించగా, లక్నో కేవలం రెండు మ్యాచ్‌లలోనే గెలిచింది. 2025 సీజన్‌లో చివరిసారిగా ఈ రెండు జట్లు తలపడినప్పుడు కూడా, ఆర్సీబీ ఆరు వికెట్ల తేడాతో సునాయాసంగా విజయం సాధించడం గమనార్హం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: ఫిలిప్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), టిమ్ డేవిడ్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, సుయాష్ శర్మ. లక్నో సూపర్ జెయింట్స్: మిచెల్ మార్ష్, ఐడెన్ మార్‌క్రమ్, రిషబ్ పంత్ (కెప్టెన్/వికెట్ కీపర్), ఆయుష్ బదోని, నికోలస్ పూరన్, అబ్దుల్ సమద్, ముకుల్ చౌదరి, మహ్మద్ షమీ, అవేష్ ఖాన్, దిగ్వేష్ సింగ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్.




# రోహిత్ శర్మ హెల్త్ రిపోర్ట్.. ఆడే విషయంలో తుది నిర్ణయాన్ని రోహిత్ శర్మకే వదిలేసిన మేనేజ్మెంట్!




**గత ఆదివారం ఆర్సీబీతో మ్యాచ్ సందర్భంగా గాయపడ్డ రోహిత్**

**కండరాలకు తీవ్ర గాయం లేనట్టుగా రిపోర్ట్**

**రేపు పంజాబ్ కింగ్స్ తో ఆడటంపై అనుమానం**

ఆదివారం (ఏప్రిల్ 13) ఐపీఎల్ లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా స్టార్ బ్యాట్స్ మెన్ కుడి హ్యామ్‌స్ట్రింగ్ (ఝఎర్‌తీఅఅస్త్ర) గాయానికి గురై, రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడిన సంగతి తెలిసిందే. తాజాగా రోహిత్ మెడికల్ రిపోర్టులు వెలువడ్డాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రాథమిక స్కాన్ రిపోర్ట్స్‌లో రోహిత్ కండరాలకు ఎలాంటి తీవ్రమైన గాయం లేదా చీలిక (ఽమ్ఘతీ) ఉన్నట్లు ఆధారాలు లభించలేదు. ఇది ముంబై అభిమానులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. అయితే, ఈ నివేదిక ఇంకా అసంపూర్తిగా ఉందని, కండరాల పట్టివేత (హ్తీఘఅఅ) లేదా ఇతర అంతర్గత సమస్యలను గుర్తించడానికి మరికొన్ని పరీక్షలు అవసరమని వైద్య బృందం భావిస్తోంది. మరోవైపు, నిన్న జరిగిన జట్టు ప్రాక్టీస్ సెషన్స్‌కు రోహిత్ శర్మ హాజరుకాలేదు. గాయం తీవ్రత పెరగకుండా జాగ్రత్తగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆయన ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. రేపు వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరగబోయే మ్యాచ్‌లో రోహిత్ ఆడటంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. రోహిత్ ప్రాముఖ్యత దృష్ట్యా, పంజాబ్ మ్యాచ్‌లో ఆయనను ఆడించి రిస్క్ తీసుకోవడం కంటే, విశ్రాంతినివ్వడమే ఉత్తమమని మేనేజ్మెంట్ భావిస్తోంది. అయితే, తాజా సమాచారం ప్రకారం, ఈ మ్యాచ్‌లో ఆడాలా? వద్దా? అనే దానిపై తుది నిర్ణయాన్ని మేనేజ్మెంట్ రోహిత్ శర్మకే వదిలేసింది. పూర్తి రిపోర్టులు వచ్చిన తర్వాత రోహిత్ తన శారీరక ఫిట్‌నెస్‌ను బట్టి నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. ఈ ఐపీఎల్ సీజన్‌లో రోహిత్ శర్మ ఇప్పటివరకు 4 మ్యాచ్‌ల్లో 137 పరుగులు చేశాడు. కేకేఆర్‌పై 78 పరుగులతో అద్భుత ఫామ్‌లో ఉన్న రోహిత్, కీలకమైన సమయంలో గాయపడటం ముంబై జట్టుకు కొంత ఆందోళన కలిగించే విషయమే. బీసీసీఐ మెడికల్ టీమ్ కూడా టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయన ఫిట్‌నెస్‌ను నిశితంగా గమనిస్తోంది.

# అదరగొట్టిన బ్యాటర్లు, బౌలర్లు.. కోల్‌కతాను చిత్తు చేసిన చెన్నై

**కేకేఆర్‌పై 32 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ ఘన విజయం**

**మూడు కీలక వికెట్లతో కోల్‌కతా పతనాన్ని శాసించిన నూర్ అహ్మద్**

**బ్యాటింగ్‌లో రాణించిన సంజూ శాంసన్, ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్**

**లక్ష్య ఛేదనలో తడబడిన కోల్‌కతా.. విఫలమైన టాపార్డర్**

**ఈ సీజన్‌లో చెన్నైకి ఇది వరుసగా రెండో గెలుపు**

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జోరు కొనసాగిస్తోంది. చెపాక్‌లోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)పై 32 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో రాణించి 192 పరుగుల భారీ స్కోరు సాధించిన చెన్నై, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ అదరగొట్టింది. ముఖ్యంగా స్పిన్నర్ నూర్ అహ్మద్ (3/21), పేసర్ అన్షుల్ కంబోజ్ (2/32) అద్భుత ప్రదర్శనతో కేకేఆర్‌ను 160/7 స్కోరుకే పరిమితం చేశారు. ఈ విజయంతో చెన్నై వరుసగా రెండో గెలుపును నమోదు చేయగా, కేకేఆర్ ఈ సీజన్‌లో ఇంకా బోణీ కొట్టలేదు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నైకి యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. కేవలం 17 బంతుల్లోనే 38 పరుగులు చేసి కేకేఆర్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత సంజూ శాంసన్ (48), డెవాల్డ్ బ్రెవిస్ (41) కీలక ఇన్నింగ్స్‌లతో స్కోరు బోర్డును పరుగెత్తించారు. మధ్యలో కేకేఆర్ బౌలర్లు నరైన్, వరుణ్ చక్రవర్తి కట్టడి చేసే ప్రయత్నం చేసినా, చెన్నై బ్యాటర్లు దూకుడుగా ఆడి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించారు. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ ఛేదన ఏ దశలోనూ సాఫీగా సాగలేదు. సునీల్ నరైన్‌తో ఓపెనింగ్ ప్రయోగం చేసినా అది ఫలించలేదు. రెండో ఓవర్‌లోనే అన్షుల్ కంబోజ్.. ఫిన్ అలెన్‌ను ఔట్ చేసి చెన్నైకు తొలి బ్రేక్ ఇచ్చాడు. పవర్‌ప్లేలోనే నరైన్‌ను ఖలీల్ అహ్మద్ పెవిలియన్ పంపడంతో కేకేఆర్ 36/2తో కష్టాల్లో పడింది. అజింక్యా రహానే, అంగ్‌క్రిష్ రఘువంశీ కాసేపు ప్రతిఘటించినా, మిడిల్ ఓవర్లలో చెన్నై స్పిన్నర్లు విజృంభించారు. ముఖ్యంగా ఆఫ్ఘన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ తన మాయాజాలంతో మ్యాచ్‌ను పూర్తిగా చెన్నై వైపు తిప్పేశాడు. కీలక సమయంలో రహానేను ఔట్ చేసిన నూర్, ఆ తర్వాత ఒకే ఓవర్‌లో కామెరాన్ గ్రీన్ (గోల్డెన్ డకౌట్), రింకూ సింగ్‌లను పెవిలియన్ చేర్చి కేకేఆర్ పతనాన్ని శాసించాడు. దీంతో 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కోల్‌కతా ఓటమి అంచున నిలిచింది. చివర్లో రమణ్‌దీప్ సింగ్ (23 బంతుల్లో 35), రోవ్‌మన్ పావెల్ (22 బంతుల్లో 31 నాటౌట్) పోరాడినా అప్పటికే ఆలస్యమైంది. కంబోజ్.. రమణ్‌దీప్‌ను ఔట్ చేసి కేకేఆర్ ఆశలకు గండికొట్టాడు. చివరకు కేకేఆర్ 160/7 స్కోరుకే పరిమితమైంది. దీంతో చెన్నై 32 రన్స్ తేడాతో కోల్‌కతాను చిత్తు చేసింది. కేకేఆర్ కు ఈ సీజన్‌లో ఇది నాలుగో ఓటమి.




# కెప్టెన్ అజింక్యా రహానేకు డబుల్ ట్రబుల్.. ఓటమికి తోడు రూ.12 లక్షల జరిమానా!

**వరుస ఓటములతో సతమతమవుతున్న కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే**

**చెన్నైతో మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు రూ.12 లక్షల జరిమానా**

**ఈ సీజన్‌లో కోల్‌కతాకు ఇది తొలి తప్పిదం అని తెలిపిన ఐపీఎల్ కౌన్సిల్**

**ఐపీఎల్ 2026లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవని కోల్‌కతా**

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ అజింక్యా రహానేకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఐపీఎల్ నిర్వాహకులు రూ.12 లక్షల భారీ జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఒకటి వర్షం కారణంగా రద్దు కాగా, నాలుగింట కేకేఆర్ ఓటమి పాలవడం గమనార్హం. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రహానే సేన నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయడంలో విఫలమైంది. ఇది ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ పేర్కొంది. ఈ సీజన్‌లో కేకేఆర్ జట్టుకు ఇది మొదటి తప్పిదం కావడంతో కెప్టెన్ రహానేకు రూ.12 లక్షల జరిమానాతో సరిపెట్టినట్లు ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇక మ్యాచ్ విషయానికొస్తే, చెన్నై బౌలర్లు నూర్ అహ్మద్ మూడు వికెట్లతో, అన్షుల్ కంబోజ్ రెండు వికెట్లతో చెలరేగడంతో కోల్‌కతా మరో ఓటమిని మూటగట్టుకుంది. ఈ విజయంతో చెన్నై జట్టు ఈ సీజన్‌లో రెండో గెలుపును నమోదు చేసుకుని, 4 పాయింట్లతో పట్టికలో ఎనిమిదో స్థానానికి చేరింది. మరోవైపు ఒక్క విజయం కూడా లేకుండా రహానే నాయకత్వంలోని కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem




## రూ. 3000 కోట్ల క్లబ్‌లో 'ధురంధర్' ఫ్రాంచైజీ.. బాహుబలి, పుష్పలను వెనక్కి నెట్టి చారిత్రక రికార్డ్!

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ భారత సినీ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని అందుకుంది. రెండు భాగాలుగా వచ్చిన ఈ సిరీస్, ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 3000 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి భారతీయ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో రాజమౌళి రూపొందించిన 'బాహుబలి', ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' ఫ్రాంచైజీలను అధిగమించడం విశేషం.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం 'ధురంధర్' మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 1,307.35 కోట్లు వసూలు చేయగా, ఇటీవలే విడుదలై నెల రోజులు పూర్తి చేసుకోబోతున్న 'ధురంధర్: ది రివెంజ్' ఇప్పటివరకు రూ. 1,712 కోట్లకు పైగా రాబట్టింది. దీంతో రెండు చిత్రాల మొత్తం వసూళ్లు రూ. 3,019.35 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో 'బాహుబలి' ఫ్రాంచైజీ రూ. 2,438 కోట్లు, 'పుష్ప' ఫ్రాంచైజీ రూ. 2,092.20 కోట్ల వసూళ్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'ధురంధర్: ది రివెంజ్' చిత్రం ఒక్కటే 27 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 1,727.93 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో భారతదేశంలో గ్రాస్ వసూళ్లు రూ. 1,311.68 కోట్లు కాగా, ఓవర్సీస్‌లో రూ. 416.25 కోట్లు ఉన్నాయి. ఈ చిత్రం విడుదలైన తొలి 11 రోజుల్లోనే మొదటి భాగం లైఫ్‌టైమ్ కలెక్షన్లను అధిగమించి సత్తా చాటింది.ఈ ఘనతపై ప్రముఖ ట్రేడ్ విశ్లేషణ సంస్థ శాక్‌నిల్క్ నివేదిక స్పందిస్తూ... "ఈ రూ. 3000 కోట్ల మైలురాయి కేవలం ఒక సంఖ్య కాదు. భారతీయ ఫ్రాంచైజీలను ప్రపంచ వేదికపై చూసే దృష్టికోణంలో వచ్చిన మార్పుకు ఇది సంకేతం. ఇప్పటివరకు భారతీయ సినిమా ఎన్నో బ్లాక్‌బస్టర్లను అందించింది. కానీ, ప్రపంచంలోని అతిపెద్ద ఫిల్మ్ సిరీస్‌లతో పోటీపడగల సత్తా మన కథలకు ఉందని ధురంధర్ నిరూపించింది" అని పేర్కొంది.గల్ఫ్ దేశాలు, చైనాలో విడుదల కాకుండానే ఈ స్థాయి వసూళ్లు సాధించిన తొలి భారతీయ చిత్రంగా కూడా 'ధురంధర్ 2' నిలిచింది. రణ్‌వీర్ సింగ్‌తో పాటు అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు.

## రామ్ చరణ్ 'పెద్ది' జూన్‌కు వాయిదా.. కారణమేంటో చెప్పిన మేకర్స్

రామ్ చరణ్ 'పెద్ది' సినిమా విడుదల మరోసారి వాయిదా ఏప్రిల్ 30కి బదులుగా జూన్‌లో ప్రేక్షకుల ముందుకు పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం అదనపు సమయం అవసరమని ప్రకటన ఒక్క పాట మినహా సినిమా టాకీ పార్ట్ షూటింగ్ పూర్తి అద్భుతమైన థియేటర్ అనుభవం కోసమే ఈ నిర్ణయమన్న చిత్రబృందం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమాను జూన్ నెలలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ బుధవారం అధికారికంగా ప్రకటించింది.సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సినిమా ఎడిట్ ప్రింట్ చూసుకున్నామని, అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొంది. "ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభవాన్ని అందించాలనేదే మా లక్ష్యం. అద్భుతమైన కంటెంట్‌ను అంతే గొప్పగా ముస్తాబు చేసేందుకు, పోస్ట్ ప్రొడక్షన్, టెక్నికల్ టీమ్స్‌కు మరికొంత సమయం ఇవ్వాలనుకుంటున్నాం. వారి నైపుణ్యంతో సినిమాను పరిపూర్ణంగా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతలు వివరించారు. సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలిపిన చిత్రబృందం, అభిమానుల సహకారానికి కృతజ్ఞతలు చెప్పింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్‌లో కచ్చితమైన విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు.






## విష్ణుప్రియకు కాసులు కురిపించిన వివాదం.. ఫిర్యాదుతో అమాంతం పెరిగిన ఆదాయం!

డిజిటల్ మీడియా యుగంలో నెగెటివ్ పబ్లిసిటీ కూడా ఒక్కోసారి పాజిటివ్ ఫలితాలను ఇస్తుందనడానికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నారు బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ భీమినేని. అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆమెపై నమోదైన పోలీస్ కేసు, నైతికంగా ఆమెను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో చేసినప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఊహించని రీతిలో కలిసొచ్చింది. ఈ వివాదం కారణంగా ఆమె నెలవారీ ఆదాయం ఏకంగా రూ.11 లక్షలకు పైగా పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన వీడియోల కోసం నెలకు రూ.399 చొప్పున సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఆమెపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందకముందు, ఆమెకు 1,892 మంది సబ్‌స్క్రైబర్లు ఉండేవారు. దీని ద్వారా ఆమెకు నెలకు సుమారు రూ.7.18 లక్షల ఆదాయం వచ్చేది. అయితే, ఎప్పుడైతే ఆమెపై ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నేతలు ఫిర్యాదు చేశారో, ఈ వార్త మీడియాలో ప్రముఖంగా ప్రసారమైంది. దీంతో ఆమె అప్‌లోడ్ చేసే కంటెంట్‌లో ఏముందో చూడాలనే ఆసక్తి నెటిజన్లలో ఒక్కసారిగా పెరిగింది. ఫలితంగా, కొద్ది రోజుల్లోనే ఆమె సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,832కు చేరింది. తద్వారా ఆమె నెలవారీ ఆదాయం ఇప్పుడు రూ.18.36 లక్షలకు పైగా చేరింది. అంటే, కేవలం ఈ వివాదం వల్ల ఆమె సంపాదనలో రూ.11 లక్షలకు పైగా పెరుగుదల కనిపించింది.శనివారం విజయవాడ సూర్యారావుపేటలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ ఫిర్యాదు చేశారు. విష్ణుప్రియ డబ్బుల కోసం యువతను తప్పుదోవ పట్టించేలా అర్ధనగ్న వీడియోలు పోస్ట్ చేస్తున్నారని, ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన సెలబ్రిటీలు ఇలాంటి పనులు చేయడం సరికాదని వారు విమర్శించారు. అయితే, నైతిక విలువలను కాపాడాలనే ఉద్దేశంతో చేసిన ఈ ఫిర్యాదు, పరోక్షంగా విష్ణుప్రియకు ఉచిత ప్రచారంగా మారింది. ఒక విషయాన్ని ఎంతగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తే, దానిపై జనంలో అంతగా ఆసక్తి పెరుగుతుందనే 'స్ట్రీసాండ్ ఎఫెక్ట్' ఇక్కడ స్పష్టంగా పనిచేసింది. మొత్తంగా ఈ సంఘటన, విమర్శలే పెట్టుబడిగా మారి నెగెటివ్ పబ్లిసిటీ కూడా సానుకూల ఫలితాలను ఇవ్వగలదని నిరూపించింది.